REGD. NO. 40 A    విడిప్రతి 0-2-0    28-10-55 శుక్రవారం

# జమీన్ రైతు

సంపుటి 27 ⁑ మేనేజింగుఎడిటర్ : నెల్లూరు వెంకట్రామానాయుడు :: సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ⁑ సంచిక 43

# బొంబయి రాష్ట్రసమస్య రసఘట్టంలో పడింది!

## విశాలాంధ్ర మార్గం హైదరాబాద్ సమావేశంతో సుగమమైంది

### రాష్ట్రాల పునర్విభజన కోలాహలం

★ విదర్భనుగూడా బొంబయిలో చేర్చి, బహుభాషారాష్ట్రంగా దానిని ఏర్పరచమని మహారాష్ట్ర కాంగ్రెస్ కమిటీ తీర్మానించింది.

★ మహారాష్ట్ర కాంగ్రెస్ కమిటీ తీర్మానం తీవ్రవివాదాలకు దారితీసింది. ఇంతవరకు యీ వివాదంలో ప్రవేశించని గుజరాతీలు దీనిని వ్యతిరేకించినారు. దీనికంటె మహాగుజరాతును ప్రత్యేకంగా ఏర్పాటు చేయమని, బొంబయిని కేంద్రపాలిత రాష్ట్రంగావుంచమని గుజరాత్ రాష్ట్రకాంగ్రెస్ తీర్మానించింది. దీనితో బొంబయిరాష్ట్ర వ్యవహారం రసవత్తర ఘట్టంలో పడినట్లే భావించవచ్చు.

★ విశాలాంధ్ర విషయంలో ఆంధ్ర హైదరాబాదు మంత్రులు, రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షులమధ్య హైదరాబాదులో సంప్రతింపులు జరిగాయి. ఈ సమావేశం, తెలంగాణా నాయకుల అనుమానాలు తీర్చుటకు, విశాలాంధ్రకు వారిని సుముఖులనుచేయుటకు చాలవరకు వుపకరించింది. తిరుగా నవంబరు 22తేది వీరుకర్నూలులో సమావేశంకాగలరు. అప్పుడు విశాలాంధ్ర తక్షణం ఏర్పడదమా లేదా అనేది స్పష్టంగా తేలిపోగలదు.

★ విశాలాంధ్రకు హైదరాబాద్ మంత్రివర్గంలోని రంగారెడ్డి, చెన్నారెడ్డిగారలు, తెలంగాణా రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడు వ్యతిరేకులుగావున్నారు. విశాలాంధ్ర ఏర్పడితే, తెలంగాణావారిసొమ్ము ఆంధ్రరాష్ట్రం వారికి పెట్టవలసి వస్తుందని రంగారెడ్డిగారు బహిరంగంగా చెప్తున్నారు. ముఖ్యమంత్రి రామకృష్ణరావుగారుమాత్రం సుముఖులట.

★ కాశేశ్వరరావుగారి రాజమండ్రి విశాలాంధ్రసదస్సు వాయిదాపడింది. కాంగ్రెస్ హైకమాండు తీర్మానం, హైదరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుని నిషేధాజ్ఞ దీనికి ప్రతిబంధకాలైనవి. కమ్యూనిస్టులు తదితరులను ఆహ్వానించి హడావిడిచేయకుంటే సదస్సు నిరభ్యంతరంగా సాగిపోయివుండేది.

★ ఫజులాలీ కమిషన్ సూచనలననుసరించి, 1956 అక్టోబరు 1 తేదినాటికే క్రొత్త రాష్ట్రాలను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రుల సమావేశం నిర్ణయించింది. అంటే 1957 లో జరుగబోయే జనరల్ ఎన్నికలకు ముందే యీ కార్యక్రమం జరిగిపోతుందన్న మాట.

★ మధ్యప్రదేశ్ విషయం తీవ్రమైన వివాదసమస్యగాఏర్పడింది. అంతపెద్దరాష్ట్రం కూడదని కొందరంటే, తమ రాష్ట్రాల వ్యక్తిత్వం పోతుందని అందులో చేర్చబడుతున్న రాష్ట్రాలు గోలపెడుతున్నాయి. ముఖ్యమంత్రి రవిశంకర్ శుక్లామాత్రం ఫజులాలీ కమిషన్ సూచనకు అనుకూలుడు.

★ పంజాబు సమస్యగూడా వివాదంగానే వుంది. హిందువులు అధికంగాగల హిమాచలప్రదేశ్ ను పంజాబులో కలపటం శిక్కులకు యిష్టంలేదు. వారు ప్రత్యేకరాష్ట్రం కోరుతున్నారు. తారాసింగ్ ప్రభృతులు ప్రధాని నెహ్రూతో ఆయన పిలుపుపైనే సంప్రతించిపోయారు.

# సోమశిల

## వరద నిరోధకార్యక్రమాన్నుండి జారిపోకుండా చూచుకోవాలె

సోమశిల ప్రాజెక్టు సంఘ సమావేశం 27 తేది ఉదయం నెల్లూరులో జరిగింది. శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి, తిక్కవరపు రామిరెడ్డి, వంగల్లు కోదండరామరెడ్డి, వెన్నెలకంటి రాఘవయ్యగారలు విచ్చేశారు.

సోమశిలప్రాజెక్టువిషయంలో జరుగుతున్న కృషిపై సమీక్ష, మున్ముందు జరుగవలసిన కార్యక్రమాన్నిగూర్చి హెచ్చరిక, ఛీఫ్ యింజనీయర్ – ముఖ్యమంత్రిగారలు గత నెల్లూరు ఆగమన సందర్భంలో సోమశిల, కనుపూరు - కావలి కాల్వలగూర్చి వెల్లడించిన అభిప్రాయాలపై విమర్శజరిగినవి.

ఆంధ్రప్రభుత్వంచేసిన, చేస్తున్న కృషి ప్రశంసింపతగింది. గత ఢిల్లీ సమావేశమునకు ఛీఫ్ యింజనీయర్, మంత్రి సంజీవిరెడ్డిగారు హాజరైనపుడు సంజీవిరెడ్డిగారు సోమశిలవిషయమై గట్టిపట్టు పట్టినారనేవార్త సంతోషప్రదమైంది. సోమశిల వరదనిరోధక కార్యక్రమంలో చేర్చబడింది. ప్లానింగ్ శాఖవారు 12 కోట్ల విరాళాన్నిమాత్రమే ఆంధ్రకు యిస్తున్నారు. దానిలో గోదావరి, బుడమేరు, సోమశిల చేర్చబడినవి. అందువల్ల సోమశిలకు 4 కోట్లచిల్లర మాత్రమే ప్రత్యేకింపబడినది. అంటే ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో 4 కోట్లు సోమశిల ఆనకట్టకు ఖర్చుచేయబడును. కొరవ తృతీయ ప్రణాళికలో చేర్చబడును. 4 కోట్లతో నైనా పని ప్రారంభమైతే తర్వాత యే మంత్రాంగం కావ్యంలోనున్నా పనిఆగక దాంతట అది సాగుచుండును.

—కొరవ 4.వ పేజీలో

# ఇనాముల సవరణా బిల్లు

## —కొన్ని సందేహాలు

మద్రాసు ఎస్టేట్ల రద్దుచట్టాన్ని సవరిస్తూ ఆంధ్రప్రభుత్వం తయారుజేసిన బిల్లు ప్రకటింపబడింది. దీనిప్రకారం గ్రామంలో సగానికంటె తక్కువగాకుండావుండే యినాములు, ఖండ్రిగలు, మజరాలు– యీ సవరణ ప్రకారం ఎస్టేట్లుగా పరిగణింప బడగలవు. ఇనాంరైతులు ఎంతకాలంగానో చేస్తుండిన ఆందోళన యిప్పటికి ఫలించింది. ఈ సవరణబిల్లు రాబోవు శాసనసభ సమావేశంలో ప్రవేశపెట్టబడి, శాసనం కాగలదు. బిల్లులోని ముఖ్యాంశాలు ఈదిగువ యిస్తున్నాము.

(1) ఇదివరలో పూర్తిగ్రామము ఇనాముగా యివ్వబడివుండిననే ఎస్టేటుగా పరిగణింపబడుతూ వచ్చినది. గ్రామములోని విస్తీర్ణములో ఏ మాత్రము గ్రాంటులో చేరకుండినా అది ఎస్టేటుకాకుండా వుండినది.

ఇప్పటి సవరణచట్టం ప్రకారం పూర్తి గ్రామములేగాక, ఖండ్రిగలుగాని, మజరాలుగాని, గ్రామములో సగానికి మించిన విస్తీర్ణముగాని ఎస్టేటుగా పరిగణింపబడుతుంది.

(2) ఈ సవరణబిల్లు 1948 జనవరి 7 నుండి అమలుకు వచ్చినట్లు పరిగణింపబడుతుంది.

(3) ఆ తేది తర్వాత ఎస్టేట్లు కాదనే కారణంచేత, ఇనాం గ్రామాలలో తమ స్వాధీనంలోవున్న భూములనుండి వెళ్లగొట్టబడిన రైతులు, పై తేదీనాటికి తమ స్వాధీనములోవున్న భూములను తిరిగి స్వాధీనపరచుకొనుటకు అవకాశం కలదు.

(4) ఈ సవరణ చట్టంక్రింద ఎస్టేట్లుఅయ్యే గ్రామాలకు జమీందారీ రద్దు చట్టము అను

—కొరవ 4 వ పేజీలో

పెండ్లిండ్ల తిరుణాళ్లకు
ప్రత్యేక రకాలు

★ ★ ★ ★

లైలామజ్ను షిఫాన్
అజంతా 1955 క్రేప్
మణిపూరు డ్యాన్సుస్కర్టు
మైసూరు మల్లేశ్వరిజార్జెటు

ఇంకా ఎన్నో రకాలు వధూవరులు ఒండొరులను పెండ్లి పీటలమీద కొంత చూచుకున్నపుడే ప్రేమానుబంధముల కట్టివేయ గలగినంత ఆకర్షణీయమయిన నాగరికత కలిగినవి —

మీరు రాండి – చూడండి!

రాయపెరప్పు శంకరయ్య & సన్సు

(Specialists in Silks)

ట్రంకురోడ్డు — నెల్లూరు

# పాలసీవిషయంలోకమ్యూనిస్టులముష్టియుద్ధం!

## 'కాంగ్రెస్‌తో సహకారం' పిలుపివ్వాలని జోషీవర్గం సూచన

### ఇండియాను 'అర్ధవలస - అధీన' దేశ మని ఆంధ్రపార్టీ పాతపాట!

ఒక రాజకీయ వార్తాసేకరుడు

కమ్యూనిస్టు పాలసీలో మార్పువచ్చిందని. మార్పుక్రింద పోటీపడుతున్నారని మొదట దినపత్రికలు వ్రాశాయి. ఏ దేశకమ్యూనిస్టుపార్టీ పాలసీలోనైనా ఎట్టిమార్పువస్తుందో తెలుసు కొనను ఒకేఒక చవకమార్గం వుంది. అదే రష్యన్ విదేశాంగవిధానం. అందులో మార్పు కనిపించిందా — ఇక్కడ కూడా వెంటనే స్లేటు ఫిరాయించారని ఘంటాపథంగా చెప్పివేయ వచ్చు. యీ విషయం చరిత్రే చర్విత చర ణంగా చెప్పివేసింది.

ఆంధ్రలో ఎన్నికలపోరాటం (ఫిబ్రవరి 1955) ముమ్మరంగా సాగుతున్నప్పుడు రష్యాలో మలెంకోవ్ పతనం — కృష్చేవ్ పదవీ స్వీకారంతో రష్యన్ విదేశాంగ విధా నంలో తీవ్రమైనమార్పువచ్చింది. అంతదాకా నెహ్రూ తటస్థ విధానమును అమెరికా అనుసరణ విధానమని— ఇండియాకు సంపూర్ణ స్వాతంత్ర్యం రానేలేదని — వచ్చినదంతా బ్రిటిష్‌వారితో కుట్రపన్ని సంపాదించిన అర్ధ వలస — అధీన అధికారమని రష్యన్ పరి పాలకులు చెప్పేస్తూవుండిరి. నెహ్రూవిధానం ఖచ్చితమైన తటస్థవిధానమేనని తేలిపోగానే. దానికి వంతపాడి నెమ్మదిగా ఆయన చాటున అమెరికా పనిపట్టాలనే నిర్ణయానికి రష్యను రాగానే—మాలటోవ్ — జుకోవ్‌లు "భారత దేశం సర్వ స్వతంత్రదేశమేగాక — రష్యా — చైనాలుపట్టిన అభ్యుదయమార్గంలో నడుస్తున్న ప్రముఖ ప్రజాసామ్యదేశమని" పొగడమే గాకుండా — భారతదేశ ఆర్థికవిధానం అభి వృద్ధికర పథకంలో నడుస్తుందనికూడా చెప్పే శారు. ఇదిసరిగ్గా ఎలక్షన్ కాలంలోజరిగి కమ్యూనిస్టుల నడుములు విరిగాయి.

### జోషీవాదం

ఆంధ్ర కమ్యూనిస్టుకమిటీ రహస్యంగా "పార్టీసభ్యులకుమాత్రమే"నంటూ రెండు డాక్యుమెంట్లు చర్చకు విడుదలచేసింది. (డాక్యుమెంటు 1. నాలుగవ కమ్యూనిస్టు మహాసభ — డిస్కషన్ డాక్యుమెంటు — తే 6—10—55—(ప్రింటెడ్ స్వతంత్రా కమ్యూనిస్ట్ ప్రెస్ బెజవాడ) మొదటి డాక్యుమెంటుపై శ్రీ పి. సి. జోషి — పి. శ్రీమాలీ — యస్. యన్.

## పార్టీచర్చకుబెట్టిన సర్క్యులర్ లోని వివిధవర్గాల వాదనలు

యూసఫ్ — ఓ. పి. సంగాల్ లుల పేరుతో వుంది.

కేంద్రకమిటీ నేటికయినా తన తప్పుడు బాటనువదలి, సక్రమ మార్గంలోపడి నెహ్రూ ప్రభుత్వ శాంతివిధానమును — సామ్రాజ్యవాద యుద్ధ ప్రయత్నాలను ఎదిరించి — వలస దేశాల స్వాతంత్ర్యసాధనకు ఆసియాప్రజలను ఏకంచేస్తున్న అభ్యుదయకరపంథాను గుర్తించి నందుకు ప్రశంసించుతూనే — కేంద్రకమిటీ పరిఅయిన కార్యక్రమంగాపలేదని విమర్శిం చారు. అంతేగాకుండా — విదేశాంగ విధా నమును అనుసరించే ఏదేశ అంతరంగిక విధాన మయినా రూపొందుతుందని — అందువలన భారతప్రభుత్వం అనుసరించే జాతీయవిధా నంలో అభ్యుదయకరమైన అంశాలు ఎన్నో వున్నాయని వీకరువుపెట్టారు. "భారత ప్రభుత్వ విదేశాంగవిధానం ఏ పర ప్రభుత్వ వలుకుబడికి లోనైందికాదు. అది అభ్యుదయ కరమైన స్వతంత్రవిధానం" అన్నారు. ఇట్టి స్వతంత్రవిధానం భారతదేశం అనుసరించుతుం దని లెనిన్ ఎప్పుడో చెప్పాడని తమవాదము నకు బలం చేకూర్చుకున్నారు. "రష్యా—చైనా — ఇండియా ప్రపంచజనాభాలో సగం. ఇవి మూడూ కలిసి ప్రపంచభవిష్యత్తును నిర్ణ యిస్తాయి. తప్పనిసరిగా మూడు సోషలిస్టు బాటనపడుస్తాయి" అని లెనిను అన్నమాటలు నేటికి చూడగలుగుతున్నా మన్నారు.

"అందువలన భారత పెట్టుబడిదారుల ప్రయత్నములు విఫలమై — ఇండియా సోషలిస్టు శిబిరమైన రష్యావైపు కు వెళ్ళుతుంది" అని

నెహ్రూ రష్యా — చైనాలలో పర్యటించడం కమ్యూనిస్టువ్యతిరేకతను సమూలంగా బూడ్చి వేసి — కమ్యూనిజానికి అనుకూలంగా దారి సరిచేసిందని — అందువలన నెహ్రూయాత్రకు కేంద్రకమిటీవారు అభూతకల్పన చేయానికన్నా — దానిని వినియోగించుకొని చక్కగా ప్రచారం చెయ్యాలన్నారు. అల్లాగే బుల్గానిన్ — కృష్చేవ్‌లు భారతదేశంరావడం — మన ప్రభు త్వం వారికి ఘనస్వాగతమివ్వడం కమ్యూ నిజానికి పెట్టనికోట — పూహించని బలమని, అమెరికా యుద్ధకుతంత్రాలకు చెంపపెట్టని వర్ణించి "అట్టి రష్యన్ నాయకులరాకను చక్కగావినియోగించుకొనను మననాయకత్వం సిద్ధంగాలేదంటే — పరిస్థితిని వారు సరిగా అర్థంచేసుకొనలేదు" అన్నారు.

విదేశాంగ విధానంలో అట్టి శాంతిమార్గం ఇండియన్ గవర్నమెంటు అనుసరించడానికి కారణం ఏమిటి? ఎవరు? అని ప్రశ్నించుకొని "కాంగ్రెస్‌లో అభివృద్ధికరవర్గం పైకార్యక్ర మానికి, పంచవర్ష ప్రణాళికలకు బాధ్యులని కేంద్రకమిటీ గుర్తించడం మంచిదే. కాని వారు దాని పూర్తిఅర్థమును గ్రహించలేదు. కారణం పైవన్నీ అంగీకరించి — ఇంకా కాం గ్రెస్‌తరఫ్రింటు అనే నినాదం ఇవ్వడమును బట్టి — వీలయినచోట్ల కాంగ్రెసేతర ప్రభు త్వాలు ఏర్పరచాలనడంబట్టి మొత్తం పరిస్థితిని తారుమారుచేశారు" అని విమర్శించి జోషీ వర్గం యీ క్రిందికార్యక్రమమును పార్టీ స్వీక రించాలంటుంది. "కాంగ్రెసుతో సహా ఐక్య సంఘటన అని పిలుపివ్వాలి. అంతర్జాతీయ రంగంలో రష్యా — చైనా — ఇండియా ఒక టయి శాంతిబ్లాకుగా తయారవ్వాలనికోరాలి. దేశపునర్నిర్మాణకార్యక్రమంలో పాల్గొంటూ తప్పులు ఎత్తిచూపి — ప్రజాసమీకరణ చెయ్యాలి. అల్లా చేస్తే అంతరంగికంగా కాంగ్రెసులో పోరాడుచున్న అభివృద్ధివర్గం మనతో కలిసివచ్చి — కాంగ్రెసులోని అభి వృద్ధి నిరోధకులను వంటరిచేయగలం. వీల యిన అన్నిచోట్లా మిశ్రమ మంత్రివర్గముల ఏర్పరచి—తద్వారా అధికారమును త్వరలో హస్తగతం చేసుకోనగలం" అనిసూచించారు.

### ఆంధ్ర ధోరణి

రెండవ డాక్యుమెంటు శ్రీ పి. సుంద రయ్య — యం. బసవపున్నయ్య — యం. హనుమంతరావుల పేరుతోవుంది. వీరివాదం నెహ్రూ విదేశరంగంలో అటురష్యాను, ఇటు అమెరికానూ వుపయోగించుకొన చూస్తున్నా

—కొరవ 6 వ పేజీలో

## రష్యాపైఖరిమారితే...... వీరిపాలసీ మారుతుంది!!

ఎలక్షన్ తర్వాత అజయఘోష్ — డాంగే తదితర నలుగురు ప్రధాన నాయకులు రష్యా వెళ్ళివచ్చారు. పార్టీ మహాసభరానున్న ఫిబ్ర వరికి వాయిదావేశారు. ఈలోపల కేంద్ర కార్య వర్గం ఒక వాడుగాటి రాజకీయ తీర్మానంచేసి క్రిందికమిటీలకు చర్చకుపంపింది. ఆ తీర్మానం కేంద్రకమిటీలోకూడా సర్వాంగీకారయుత మైందికాదని—దానపై వరుసగావస్తున్న విరుద్ధ అభిప్రాయములే తెలియచేస్తున్నాయి. మాజీ పార్టీ కార్యదర్శి శ్రీ పి. సి. జోషికి చక్కని అవకాశం దొరికింది. గత మధుర మహాసభలో ఆయన వోడిపోయాడు. అప్పట్నుండీ తన పోరాటం సాగిస్తూనేవున్నాడు. కాలంకలిసి వచ్చి — రష్యన్లు విదేశాంగ విధానంలో నెహ్రూనుఆకర్షించను ఎత్తుగడ వేయుటంలో. "కాంగ్రెస్‌తోసహా ఐక్యసంఘటన" అని జోషి చెప్తూవచ్చిన వాదమునకు పూర్తిగ్గాగా బలంకలిగినట్లైంది.


# అదును మించిపోతున్నది!

ప్యాడీమిక్చర్లు వాడుటకు అదును మించిపోతున్నది

మన జిల్లా రైతుల అభిమానము, ఆదరణ పొందిన మా

నాగలి మార్కు

# ప్యాడీ మిక్చెరు

యీ క్రింద వుదహరించిన డిపోలలో తయారుగావున్నది.

రైతులు త్వరపడవలెను.

కావలి, అల్లూరు, ఊటుకూరు, అలగానిపాడు, ముదివర్తి, కోవూరు, నెల్లూరు, కోట.

## ఆంధ్ర కెమికల్ ఫెర్టిలైజర్ కంపెనీ

4/91 సంతపేట (సర్వదరపువారి మిల్లుకుపోయేరోడ్డు)

నెల్లూరు

టెలిఫోన్ : 67.

